పట్టుకోండి చూద్దాం

- పట్టణంలో వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న జనం
- మితిమీరిన రాజకీయ జోక్యంతో తాడిపత్రికి రాని పోలీసులు



పట్టుకోండి చూద్దామంటూ పోలీసులకు దొంగలు సవాల్ విసురుతున్నారు. పట్టణంలో తాళం వేసిన ఇళ్లు, వ్యాపార సముదాయాలే లక్ష్యంగా దొంగలు చోరీలకు తెగబడుతున్నారు. ముందు రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు చోరీలకు పథక రచన చేస్తున్నారు. ఇటీవల 15 రోజుల వ్యవధిలో పలు చోట్ల దొంగతనాలు జరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. దొంగలు రాత్రి, పగలు తేడా లేకుండా దొంగతనాలు చేయడం ద్వారా పోలీసులకు సవాల్ విసిరినట్లయింది. కష్ట పడి సంపాదించిన సొమ్మును ఇలా అప్పనంగా ఎత్తుకుపోతే తమ భవిష్యత్తేంటని బాధితులు వాపోతున్నారు.

తాడిపత్రిటౌన్:
వరుస దొంగతనాలతో తాడిపత్రి వాసులు బెంబేలెత్తుతున్నారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాలంటే జనం జంకే పరిస్థితి పట్టణంలో నెలకొంది. ఇటీవల పట్టణంలోని పలు కాలనీల్లో వరుస దొంగతనాలు చోటు చేసుకున్నాయి. నగదు, విలువైన బంగారు, వెండి నగలు చోరీకి గురికావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ప్రజల ఆస్తులను కాపాడాల్సిన పోలీసులు తీరికగా చోరీ జరిగిన అనంతరం వచ్చి కేసులు నమోదు చేసి వెళ్తున్నారు. కానీ చోరీలను అరికట్టడానికి చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత సాకుతో పోలీస్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

పోలీసులపై మితిమీరిన రాజకీయ జోక్యం

తాడిపత్రిలో ఖాకీపై ఖద్దరు సవారీ చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యం పోలీసుల చేతులు కట్టి పడేస్తున్నారు. ఏదైనా జరిగితే ఉన్నతాధికారులతో మాట పడేకంటే తాడిపత్రికి వెళ్లకుంటేనే నయం అని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో దాదాపు 61 మంది సిబ్బంది ఉండాల్సింది కేవలం 31 మంది విధులు నిర్వహిస్తున్నారు.. ఒక సీఐతోపాటు ఇద్దరు ఎస్‌ఐలు, 10 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 45 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాల్సి ఉండగా కేవలం సీఐతో పాటు ఒక్క ఎస్‌ఐ మాత్రమే ఉన్నారు. అలాగే 10 మంది హెడ్‌కానిస్టేబుల్స్ ఉండాల్సిన చోట ఏడుగురు మాత్రమే ఉన్నారు. 45 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సిన చోట కేవలం 19 మంది ఉన్నారు. అదనపు విధులు అంటూ వీరిలో కొంత మంది వేరే చోట విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం తాడిపత్రిలో కేవలం తొమ్మిది మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. దీంతో తాడిపత్రిలో దొంగలు ఆడిందే ఆటగా మారింది. రాత్రి పగలు తేడా లేకుండా చోరీకి పాల్పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాడిపత్రి పోలీస్ స్టేషన్‌కు సరిపడా సిబ్బందిని నియమించి చోరీలు నివారించి, ఆస్తులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

తాడిపత్రిలో ఇటీవల చోరీలు ఇలా..

నవంబర్‌లో యల్లనూరు రోడ్డులో వరుసగా ఐదు షాపుల్లో దొంగలు పడి విలువైన వస్తువులు దొంగిలించారు. మరుసటి రోజే గన్నెవారిపల్లి కాలనీలో మూడుషాపుల్లో దొంగలు పడ్డారు. డిసెంబర్ 31న గాజుల క్రిష్టప్ప వీధిలో ముగ్గులు వేస్తున్న టీచర్ రాజ్యలక్ష్మి మెడలోని బంగారు చైన్‌లు దొంగలు లాక్కెళ్లారు. జనవరి 7న శ్రీనివాసపురంలో టీచర్స్ ఇంటిలో దొంగతనం జరిగి ఆరు తులాల బంగారు ఎత్తుకెళ్లారు. 8న టైలర్స్ కాలనీ, టీచర్స్ కాలనీల్లోని మూడు ఇళ్లల్లో చోరీలు జరిగి 40 వేలు నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. 9వ తేదీ అర్ధరాత్రి పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో మూడు దుకాణాలు ఒక ఇంట్లో దొంగలు పడి రూ.40 వేల నగదు, రూ.30 వేలు విలువ చేసే వెండి నగలు దోచుకెళ్లారు.



శ్రీనివాసపురంలో జరిగిన చోరీలో బీరువా తెరిచి వస్తువులను చెల్లాచెదురుగా పడేసిన దొంగలు

దుకాణానికి కన్నం వేశారు



పట్టణంలో షానిటరీవేర్స్ షాపు నిర్వహిస్తున్నా. గత నవంబర్‌లో దొంగలు షాపుకు కన్నం వేసి నగదు దొచుకెళ్లారు. ఆరోజు మా షాపులో పాటు మరో నాలుగు షాపుల్లో దొంగతనం జరిగింది. దొంగల భయంతో భయంగా వ్యాపారాలు నిర్వహించాల్సి వస్తోంది. ఏదైన విలువైన వస్తువులు షాపులో ఉంటే నిద్రరావడం లేదు. పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలి. – రామ్మోహన్, బాధితుడు, తాడిపత్రి

ఊరికి వెళ్లాలంటే భయం



పట్టణంలో జరిగే వరుస దొంగతనాలు గురించి వింటుంటే భయంగా ఉంది. ఇంటికి తలుపులు వేసి బంధువుల ఊళ్లకు వెళ్లాలంటే ఏం జరుగుతుందోనన్న ఆందోళనలో ఉన్నాం. కనీసం సంక్రాంతి పండగకు ఊరికి వెళ్దాం అంటే భయపడాల్సి వస్తోంది. పోలీసు అధికారులు చర్యలు తీసుకొని దొంగతనాలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాట్లు చేయాలి. – రేవతి, అంబేద్కర్‌నగర్

పోలీసులకు సమాచారమివ్వాలి



పట్టణంలో దొంగతనాలు జరగకుండా గట్టి నిఘా పెట్టాం. పట్టణంలో ఇళ్లకు తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. కాలనీల్లో అపరిచిత వ్యక్తులు తిరుగుతుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సీసీ కెమెరాలు వినియోగించుకుంటే మరీ మంచిది. దొంగతనాలు జరగకుండా చర్యలు చేపడతాం. – సాయిప్రసాద్, పట్టణ సీఐ, తాడిపత్రి

వైభవంగా పెద్దమ్మ జాతర




యల్లనూరు: దున్నపోతును ఊరేగిస్తున్న దృశ్యం, పూజలందుకుంటున్న పెద్దమ్మ అమ్మవారు

యల్లనూరు: మండల కేంద్రంలోని పాతపేటలో వెలసిన పెద్దమ్మ, చౌడమ్మ ఆలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పూజలు, అర్చనలు చేశారు. 11గంటలకు కోలాటం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రికి చౌడమ్మ జ్యోతులను ఏర్పాటు చేశారు. అనంతరం పెద్దమ్మ దున్నపోతును ఊరేగించారు. భక్తులు అమ్మవారి సేవల్లో పాల్గొన్నారు. పుట్లూరు సీఐ సత్యబాబు, ఇద్దరు ఎస్‌ఐలు, 50 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. కాగా ఆదివారం తెల్లవారుజామున అమ్మవారి దున్నపోతును బలిదానం చేయనున్నట్లు కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు.అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పిస్తామన్నారు.

కడవకల్లులో..

పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామంలో శనివారం పెద్దమ్మ అమ్మవారి దేవర ఉత్సవం ఘనంగా ప్రారంభించారు. శనివారం రాత్రి నుంచి పెద్దమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 13 సంవత్సరాల అనంతరం గ్రామస్తులు చేపడుతున్న దేవర సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బంధుమిత్రులతో గ్రామంలో భారీగా జన సందోహం కనిపిస్తోంది. ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.సోమవారం చౌడేశ్వరీ అమ్మవారి జ్యోతుల మహోత్సవం ఉంటుందన్నారు. వేడుకల సందర్భంగా కడవకల్లులో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పుట్లూరు సీఐ సత్యబాబు తెలిపారు. దాదాపు 40 మంది పోలీసు సిబ్బందితో పాటు స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు చేపడుతున్నామన్నారు. ప్రజలు దేవర మహోత్సవం ప్రశాంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు.




పుట్లూరు: పూజలు నిర్వహిస్తున్న కడవకల్లు గ్రామస్తులు, అలంకరణలో పెద్దమ్మ అమ్మవారు

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

శింగనమల: వాతావరణ పరిస్థితుల కనుగుణంగా పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం బుక్కరాయసముద్రం మండలంలోని రేకుల కుంట వ్యవసాయ పరిశోధన స్థానంలో పరిశోధన స్థానం అధిపతి డా.ఎం.విజయశంకర్ బాబు అధ్యక్షతన వ్యవసాయ శిక్షణ– సందర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జిల్లా వ్యవసాయాధికారి, రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం, కేవీకే కళ్యాణదుర్గం, కేవీకే రెడ్డిపల్లి వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు చేపట్టవలసిన ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రబీ పంటలైన పప్పుశనగ, మొక్కజొన్న, జొన్న, వరి, ఉలవలో చేపట్టవలసిన యాజమాన్యం గురించి శాస్త్రవేత్తలు వివరించారు వేరుశనగలో పొగాకు లద్దె పురుగు , ఆకు ముడత, మొదలు కుళ్లు తెగులు , కాండం తెగులు నివారణకు నవల్యురాన్, ఇండాక్సికార్బ్ కలిసి 250 మి.లీకు సాఫ్ 400 గ్రాములు ఎకరాకు 200 లీటర్ల నీటికి కలిపి మొక్క మొదలు బాగా తడిచేల పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్నకు పంటలో కత్తెర పురుగు, టర్సికం ఆకు ఎండు తెగులు నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు, హెక్సాకొనజోల్ 400 మి.లీ. 200 నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. శాఖీయ దశలో ఉన్న తోటల్లో పూత రావడానికీ పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, బోరాన్ 2.0 గ్రాములు లీటరు నీటికి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. మామిడిలో తేనెమంచు పురుగు, పక్షి కన్ను తెగులు , బూడిద తెగులు నివారణకు లీటరు నీటికి 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్, 2.0 మి.లీ క్లోరోథలోనిల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పచ్చిపూత దశలో నున్న తోటల్లో లీటరు నీటికి 0.3 గ్రాములు థయోమిథాక్సామ్ లేదా 1.5 మి.లీ బుప్రోఫెజిన్, 2.0 హెక్సా కొనజోల్ లేదా 2 గ్రాములు మాంకోజెబ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా.కే భార్గవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

వారం రోజుల్లో రికవరీ చేయాలి

గుంతకల్లు రూరల్: వారం రోజుల్లోగా రికవరీ నగదు జమ చెల్లించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్, ప్రిసైడింగ్ అధికారి సలీంబాషా సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పీడీ ఆధ్వర్యంలో అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి పర్వీష్ తదితరులు ఉపాధి పనులపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. గుంతకల్లు మండలంలో 2023–24లో రూ.12.91 కోట్ల నిధులతో వివిధ రకాల పనులు నిర్వహించారు. ఇందులో రూ.1.03 లక్షలు రికవరీకి అదేశించగా, విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంగా 25 పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్‌లకు కలిపి రూ.95 వేలు జరిమానా విధించారు. పీడీ మాట్లాడుతూ రికవరీ కట్టని వారిపై ఆర్‌ఆర్ యాక్ట్‌తోపాటు, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, ఎంపీపీ బీవీ మాధవి, ఏపీవో కృష్ణమూర్తి, మండల ఇంజనీర్ ఓబులేసు, ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

తాడిపత్రి అర్బన్/గుంతకల్లుటౌన్/గుత్తి/గుత్తిరూరల్/శింగనమల/గార్లదిన్నె/యల్లనూరు/పెద్దవడుగూరు/యాడికి: పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించాలని, పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామక్రిష్ణ అన్నారు. శనివారం తాడిపత్రి పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అశోక్ పిల్లర్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడళ్లు, బస్టాండ్, అన్ని చోట్లా పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా సంఘాలు, వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జయరాం మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, టీడీపీ నాయకుడు నారాయణస్వామి, పలువురు కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు పాల్గొన్నారు. గుత్తిలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు చీపుర్లు చేత పట్టి పరిసరాలతో పాటు రోడ్లను శుభ్రం చేశారు. అలాగే బుక్కరాయసముద్రం మండలంలోని అనంతసాగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. అలాగే గుత్తి, గార్లదిన్నె, యల్లనూరు, పెద్దవడుగూరు, యాడికి మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ, ప్రత్యేకాధికారి, ఈఓఆర్డీలు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు.

సంక్షిప్త వార్తలు

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష

తాడిపత్రిటౌన్: పట్టణంలోని మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, త్రిబుల్ ఎస్ పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష సజావుగా సాగింది. దాదాపు 398 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా త్రిబుల్ ఎస్ పాఠశాల ఎదుట ఎలాంటి షెల్టర్ లేకపోవడంతో పిల్లలను పరీక్షలకు తీసుకువచ్చిన వారి తల్లిదండ్రులు పాఠశాల ఎదురుగా ఇళ్ల బయట ఎండలో కూర్చొని ఇబ్బందులు పడ్డారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

గార్లదిన్నె: ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తహసీల్దార్ ఈరమ్మ అన్నారు.శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తూ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందిన ఓబులేసును రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే రద్దు చేయాలని వినతి

శింగనమల: కూటమి పార్టీలు ఎన్నికల్లో భూ సర్వేను రద్దు చేస్తామని హామీ ఇచ్చి, అధికారం చేపట్టాక భూసర్వే చేపడుతున్నాయని, వెంటనే రద్దు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం రెడ్డిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కుళ్లాయప్ప, శ్రీనివాసులు, కె.నారాయణస్వామి, రామిరెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణపై అవగాహన సదస్సు

యాడికి: మండలంలోని కమలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం, కుందన కోట రచ్చకట్ట వద్ద భూసేకరణపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, జెన్‌కో డీఈ ఆంజనేయులు మాట్లాడారు. కమలపాడు, కుందనకోట రెవెన్యూ గ్రామాల్లో 950 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం 875 ఎకరాల్లో నిర్మించనున్న ఏపీ జెన్‌కో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వ భూమి 280 ఎకరాలు ఉందని, ఇంకా 595 ఎకరాలు అవసరమన్నారు. పవర్ ప్రాజెక్ట్‌లో అర్హత ఉన్న స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. పవర్ ప్రాజెక్ట్‌కు భూములు ఇస్తున్న రైతులకు ఆమోద యోగ్యమైన ధర కల్పిస్తామని, ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాలను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్‌ఐ రమణ , గుడిపాడు వైఎస్సార్‌సీపీ దండు రాముడు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త తిరుపాలు(32) అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. పార్టీ నాయకులు కప్పలబండ మధుసూదన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గంగరాజు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఆంజనేయులు శనివారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డులో శనివారం బైక్ బోల్తా పడి ధనుంజయ, రాము అనే వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ విక్రయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ జబ్బార్‌మియా

గుత్తి: ప్లాస్టిక్‌ను విక్రయించినా, వినియోగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని వ్యాపారులను మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా హెచ్చరించారు. గుత్తిలోని పలు దుకాణాలను అధికారులు, సిబ్బందితో కలసి కమిషనర్ తనిఖీ చేశారు. ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించిందన్నారు. నిషేధిత వస్తువులను విక్రయిస్తే జరిమానాతో పాటు చర్యలు తప్పవన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ పేపర్లు, కవర్లు విక్రయించడానికి, వినియోగించడానికి వీలు లేదన్నారు. తమ ఆదేశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మూర్ఛ వ్యాధి శిబిరానికి స్పందన

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కార్యాలయంలో మూర్ఛ వ్యాధి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులను పరీక్షించి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, కార్యదర్శి రఫీ, సభ్యులు సత్యప్రసాద్‌రెడ్డి, జోసఫ్‌రెడ్డి, మాబు, ఉమర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గుంతకల్లుటౌన్: ఏలూరు జిల్లా నూజివీడులో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకూ నిర్వహించే ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సమాఖ్య నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు వినోద్‌కుమార్, వెంకట్‌నాయక్ కోరారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యాసంవత్సరమే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.3580 కోట్లను విడుదల చేయాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ.77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అఖిల్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రోహిత్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

షీప్ సొసైటీ అధ్యక్షుడిగా రామకృష్ణ



అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని సచివాలయం వద్ద శనివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా సిద్దప్ప రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా సుద్దల లక్ష్మీనారాయణతో పాటు మరో ఏడుగురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, డైరెక్టర్లను సర్పంచ్ గురుమస్తాన్, ఉప సర్పంచ్ రాముయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుద్దల సుధాకర్, వెంకట్రాముడులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాము, సురేష్, ఎస్.సురేష్, ఓబుళప్ప పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీలో వర్క్‌షాపు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హెచ్‌ఐఈఈ ఎండీ మదన్‌మోహన్

శింగనమల: బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురంలోని ఎస్‌ఆర్‌ఐటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థులకు సోలార్ ఫోటోవోల్టాయిక్ సిస్టం డిజైన్, ఇంప్లిమెంటేషన్‌పై రెండు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహించారు. శనివారం హెచ్‌ఐఈఈ మేనేజింగ్ డైరెక్టర్ మదన్‌మోహన్ వర్క్‌షాపు సైట్ అసెస్‌మెంట్, సిస్టమ్ సైజింగ్, కాంపోనెంట్ సెలెక్షన్, కాస్ట్ అనాలిసిస్ వంటి ప్రాథమిక అంశాలను వివరించారు. విద్యార్థులు హ్యాండ్ –ఆన్ సెషన్‌లో పాల్గొన్నారు. ఆధునాతన సాఫ్ట్‌వేర్ సాధనాలను ఉపయోగించి, సమర్థవంతమైన పీవీ సిస్టంలను రూపొందించడానికి కేస్ స్టడీస్‌లను విశ్లేషించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

తాడిపత్రిటౌన్: తాడిపత్రి ఏఎస్పీగా రోహిత్‌కుమార్ చౌదరి శనివారం డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామక్రిష్ణుడు, సీఐలు సాయిప్రసాద్, శివగంగాధర్‌రెడ్డి, రామసుబ్బయ్య, ఎస్‌ఐలు గౌస్‌బాషా, ఆంజనేయులు, ధరణిబాబు, రమణ, నాగేంద్రప్రసాద్ ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అలాగే తాడిపత్రి నుంచి అనంతపురానికి బదిలీపై వెళ్తున్న డీఎస్పీ రామకృష్ణుడుని పూలహారాలు, శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు.

ఎస్పీతో భేటీ

అనంతపురం: తాడిపత్రి ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రోహిత్ కుమార్ చౌదరి శనివారం ఎస్పీ పి.జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రోహిత్ కుమార్ చౌదరి రాష్ట్ర గ్రేహౌండ్స్ విభాగం అసాల్ట్ కమాండర్‌గా పని చేస్తుండగా, తాడిపత్రి ఏఎస్పీగా బదిలీ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పామిడి: పామిడి సమీపంలోని పెన్నానది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం పట్టుకున్నారు. ట్రాక్టర్లను వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తరలించారు. ఇసుక అక్రమ రవాణాదారులపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సీజ్ చేసిన ఇసుక అక్రమ రవాణాకు టీడీపీ నేతల యత్నం

శింగనమల: మండలంలోని సలకంచెర్వు–కొరివిపల్లి వద్ద నున్న చీలేపల్లి వంకలో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుకను శనివారం టీడీపీ కార్యకర్తలు జేసీబీ పెట్టి అక్రమ రవాణాకు ప్రయత్నించారు. రెవెన్యూ సిబ్బందితో అడ్డుపడడంతో వెనక్కుతగ్గారు. ఈ నెల 12న అధికారుల చోద్యం–తమ్ముడి భోజ్యం శీర్షికన సాక్షిలో ఇసుక అక్రమాలపై వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు అక్రమంగా నిల్వ ఉంచిన 20 టిప్పర్ల ఇసుకను సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను టీడీపీ కార్యకర్తలు కొంత మంది జేసీబీ తెచ్చి, టిప్పర్లలో అక్రమంగా తరలించడానికి వచ్చారు. కాపలాగా ఉన్న రెవెన్యూ సిబ్బందిని అడ్డుకోవడంతోపాటు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లారు.

రేపటి నుంచి తిరునాల

పామిడి: పట్టణంలోని కొండూరురోడ్డులో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో అంకాలమ్మ, కుంటెమ్మ దేవతమూర్తుల తిరునాళ్లను జయప్రదం చేయాలని ఆలయ పూజారి నాగన్న శనివారం తెలిపారు. ఇందులో భాగంగా అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక విశేష పూజలతో పాటు రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. 21న పాలపళ్ల విభాగానికి సంబంధించి విజేత వృషభరాజులకు 1,2,3,4,5 బహుమతులకు గాను వరుసగా రూ.30వేలు, 20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేల చొప్పున బహుమతులు ఉంటాయన్నారు. అలాగే న్యూ కేటగిరి విభాగానికి గాను విజేత వృషభరాజులకు 1,2,3,4,5 బహుమతులకుగానూ వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. రెండురోజుల పాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక



సమావేశమైన ఆటో యూనియన్ కార్మికులు

శింగనమల: బుక్కరాయసముద్రం కొండమీదరాయుడు ఆటో యూనియన్ కమిటీని సీఐటీయూ అనుబంధ కమిటీగా శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ యూనియన్ అధ్యక్షుడిగా సి.నాగేంద్ర, ఉపాధ్యక్షుడిగా రాఘవరెడ్డి, సలహాదారులుగా శ్రీనివాసులు, పోతులయ్య, రామాంజినేయులు, కమిటీ మెంబర్లుగా చిరంజీవి, కొండ, నాగరాజు, ఆశ్వర్థ, విశ్వనాథ్ , గోపీ, అశోక్, కుళ్లాయప్ప, భాస్కర్, లక్ష్మీనారాయణ, బాలు, బూసిలను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

పామిడి: పట్టణంలోని తలవాలకట్టవీధిలోని సరస్వతి విద్యామందిరం, నిట్టూరు నిలయం నూతన భవన నిర్మాణానికి శనివారం కల్లూరు పారిశ్రామికవేత్త రాంప్రసాద్ దంపతులు భూమిపూజ చేశారు. హెచ్‌ఎం తులసీబాయి, కమిటీ సభ్యులు కల్లుమడి బాలనాగరాజుగుప్తా, బొల్లు శ్రీనివాసరెడ్డి, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.